

# స్వేచ్ఛ

ఉదయం రైలు దిగి ఇంటికి వచ్చినప్పటి నుంచీ శకుంతల క్షణం విశ్రాంతి లేకుండా పనిచేస్తోంది. అయినా ఎంతకీ తెమలడంలేదు ఒక్క నాలుగురోజులు తను లేకపోయేసరికి ఇల్లంతా నానా భంసాంగానూ తయారైంది. ఎక్కడ చూసినా విడిచిన బట్టలూ, కాఫీ గ్లాసులూ, టీ కప్పులూ కనిపిస్తున్నాయి "కాఫీ-టీలు పెట్టుకు తాగడానికీ, ఫ్రెండ్సుకి ఇవ్వడానికి అయితే తెలుస్తుందికాని ఆ కప్పులూ గ్లాసులూ తీసి పనిమనిషికి వేయాలన్న జ్ఞానంలేదు వీళ్ళకి" అనుకుంటూ అవన్నీ వెదికి పెరట్లో పనిమనిషికి పడేసి, ఇంట్లో పోగయిన చెత్తా చెదారం తీసి చిందర వందరగా పడివున్న సామాన్లు మళ్ళీ ఎక్కడివక్కడ సర్ది శుభ్రంచేసేసరికి తల ప్రాణం తోకకొచ్చినంత పనైంది శకుంతలకు. "ఇంత పెద్దవాళ్ళయ్యారన్న మాటేగాని కొంచెం కూడా బాధ్యత తెలీదు వీళ్ళకు" అనుకుంటుంటే "నీవల్లే వాళ్ళిలా తయారవుతున్నారు." అని రోజూ తనని భర్త దెప్పి పొడవడం గుర్తొచ్చింది శకుంతలకు.

అందే పిల్లలకు తను బాగా చనువిచ్చి చెడగొడుతోందన్న మాట. అయితే ఆ మాత్రం చనువు స్వేచ్ఛ ఇవ్వకపోతే వాళ్ళేమయిపోతారు? తన అక్కయ్య పిల్లల్లానే తయరవుతారు అంతే.

ఈ ఆలోచన రాగానే శకుంతల భయంతో వణికిపోయింది. "అమ్మో...వాళ్ళు మాత్ర అలా కాకూడదు." అని కోరుకుంది ఆమె మనసు.

మళ్ళీ అంతలోనె "ఛ! వాళ్ళెందుకలా తయారవుతారు? ఎన్నటికీకారు. అక్కయ్య ఇంట్లో అయితే తల్లిదండ్రుల దగ్గర భయం తప్ప చనువూ స్వేచ్ఛ తగినంత లభించక పోవడంతో వాళ్ళ పిల్లలు అలా తయారయ్యారేమోగాని- తన పిల్లలు అలా కాదు. ఎందుకంటే తన పిల్లలు ఎంతో ఆదర్శమైన దంపతులని పేరుపొందిన తమ కడుపులో పుట్టిన వారు. తమను చూస్తే ఏ దయ్యాన్నో, భూతాన్నో చూసినట్లు భయపడకుండా తమ మనసు


జె. సుబ్బలక్ష్మి




లోని మాటను ధైర్యంగా చెప్పుకోగల చనువు, స్వేచ్ఛ ఉన్నవారు. అలాంటప్పుడు వాళ్ళెందుకలా తయారవుతారు? ముమ్మాటికీ కారు." అని తనకు తానే సమాధానం చెప్పుకుంది

ఈలోగా సాయంకాలం అయి పిల్లలూ, భర్తా ఒక్కొక్కళ్ళుగా ఇంటికి రావడం; వాళ్ళకు కాఫీ, టిఫినూ అమర్చి మళ్ళీ రాత్రికి వంట చేయడం; అన్నీ పూర్తయేసరికి ఒళ్ళు హూనమయిపోయినట్లనిపించింది.

రాత్రి పదిగంటలకు మామూలుగా అందరూ పడుకున్నారు. ఉదయంనుంచీ పనిచేసి అలసిపోయి వుండటంతో శకుంతలకు మేను వాల్చిన వెంటనే నిద్రపట్టి వుండాల్సింది. కానీ మనసు ఇంకా స్థిమితానికి రాకపోవడంతో ఆమెకు ఓ పట్టాన నిద్రపట్టలేదు. ఆమె మనసును మళ్ళీ అదే ఆలోచనలు చుట్టుముట్టాయి, అలా ఎంతసేపు గడిచిందో ఆమెకే తెలియదు. బయటనుంచి 'అమ్మా...' అన్న పిలుపూ, తలుపు తట్టిన చప్పుడూ ఒకేసారి వినిపించాయి, చప్పున వాస్తవంలోకి వచ్చి గడియారంకేసి చూసింది శకుంతల. పన్నెండు గంటలు కావస్తోంది.

మంచం దిగుతూ ఆమె భర్తకేసి చూపు సారించింది. అతను మంచి గాఢ నిద్రలో ఉన్నాడు. అడుగులో అడుగువేస్తూ మెల్లిగా వెళ్ళి చప్పుడు కాకుండా జాగ్రత్తగా వీధితలుపు తీసింది.

పదహారేళ్ళ కొడుకు ప్రకాశ్ పిల్లిలా లోపలకు దూరాడు. తల్లి ఇంకా పడుకోకుండా తనకోసం కనిపెట్టుకుని వుండటం చూసి "సారీ మమ్మీ..." అన్నాడు నొచ్చుకుంటూ.

"ఏడ్చావ్లే... ఫ్లాస్కులో వేడిపాలు పోసిపెట్టాను తాగి పడుకో!" అని చెప్పి మళ్ళీ బెడ్‌రూంలోకి వచ్చి పడుకుంది శకుంతల.

ఇలా అప్పుడప్పుడు ప్రకాశ్ తన ఫ్రెండ్స్‌తో కలిసి సెకండ్‌షో సినిమాలకు వెళ్ళిరావడం; వాడు వచ్చేదాకా నిద్రపోకుండా కనిపెట్టుకుని తలుపు తీయడం తనకు పరిపాటే, కానీ తన భర్త ఆనందరావుకు ఇది ఎంత మాత్రం నచ్చదు. ఆయన చాలా స్ట్రిక్టు మనిషి. ఇంట్లో తనలాగే అందరూ డిసిప్లిన్‌గా ఉండాలని కోరుకుంటాడు. అన్నీ టైంప్రకారమే జరగాలి ఆయనకు. వేళాపాళా లేకుండ ఎప్పుడు పడితే అప్పుడు తినటం; ఎప్పుడు పడితే అప్పుడు పడుకోవటం—లేవటం ఆయన అసలు సహించడు...

ఇలా భర్తగురించి ఆలోచిస్తుంటే తన అక్కయ్య భర్త మాధవరావు గుర్తుకొచ్చాడు శకుంతలకు. అతను తన భర్త ఆనందరావు కంటే ఎక్కువ స్ట్రిక్టు మనిషి. ఇష్టం ఉన్నా లేకపోయినా అందరూ తన మాట విని తీరాలి; ఇంట్లో అన్నీ తను చెప్పినట్లే జరగాలి. అని శాసించే చండశాసనుడు.


"ఆయన మరీ అంత చండశాసనుడు కాబట్టే ఆయన పిల్లలు అలా తయారయ్యారు." అనిపించింది శకుంతలకు. ఇప్పుడు తనఅక్కయ్య ఉన్న పరిస్థితి తల్చుకుంటే గుండె చెరువైపోతుంది. "పాపం అంతటి మనోవేదనను ఎలా తట్టుకుంటుందో...?" అని ఆలోచిస్తూ పక్కకు తిరిగి పడుకుంది శకుంతల.

అసలు తను పొద్దుట్నుంచీ ఇంటి పనుల్లో తలమునకలై వున్నా తన మనసులో మాత్రం దైన్యత ఉట్టిపడుతున్న తన అక్కయ్య మొహం మెదులుతూనే వుంది.

"వాళ్ళ పిల్లలు అలా తయారుకావడానికి ఎవరుకారణం?" అని ఆలోచిస్తే తన అక్కయ్య, బావేననిపిస్తోంది. ఎందుకంటే పిల్లలను ఎలా పెంచాలో వాళ్ళకు తెలీదు. తన అక్కయ్య చాలా మెతకమనిషి, అమాయకురాలూనూ, ఎవరు ఏది చెబితే అది ఇట్టే నమ్మేస్తుంది. అంతేకాకుండా ఆమెకు కొంచెం కూడా స్వాతంత్ర్యం లేకుండా చేశాడు బావ. పిల్లలను ఆమె పెంచేవిధానం సరిగ్గా లేదని ఆయన వాదన. "వాళ్ళను సరైన మార్గంలో పెట్టాలంటే తమ అదుపాజ్ఞలో పెట్టుకోవాలి, తమ కనుసన్నలలో మెలిగేలా తయారుచేయాలి. అప్పుడే వాళ్ళు తల్లిదండ్రుల మాట జవదాటకుండా, వినయ విధేయతలు కలిగివుంటారు" అని ఆయన అభిప్రాయం.

కానీ పిల్లలకూ ఒక మనసూ, సొంత ఆలోచనలూ ఉంటాయనీ, వాళ్ళకూ స్వాతంత్ర్యం అవసరమనీ ఆయన ఎప్పుడూ ఆలోచించడు. చిన్నప్పుడు వాళ్ళను అదుపులో పెట్టడం ఎంతైనా అవసరమే కాని ఒక వయసు వచ్చాక వాళ్ళను శాసించాలని చూడటం మూర్ఖత్వమే అవుతుందని ఆయన ఆలోచించడు.

మంచి హోదాగల ఉద్యోగం, బోలెడంత జీతం, పెద్ద బంగళా, కారు-అన్నీ ఉన్న పెద్దఆఫీసరు తన బావ అంతటి ఆఫీసరు పిల్లలు ఇప్పుడిలా అదుపు తప్పి చెడు మార్గాలు పట్టారంటే ఆ తప్పంతా ఎవరిది? ఆయనదే. 'స్ట్రిక్టు స్ట్రిక్టు' అని వాళ్ళ ప్రాణం తీశాడు. బందిఖానాలో పెట్టినట్లు వాళ్ళను ఇంట్లో బంధించాడు. ఆ విషయంలో భార్యనుకూడా లెక్కచేయకుండా చేశాడు. అందుకే కాబోలు ఏ కాస్త అవకాశం దొరికినా తమ మనసులోని కోరికలను తీర్చు



కోడానికి ప్రయత్నించే అంతాటు వాళ్ళకు అబ్బింది. కాని దాని వల్ల నష్టపోయింది ఎవరు ? తన అక్కయ్య.

వారం రోజుల క్రితం తన అక్కయ్య దగ్గరనుంచి 'వెంటనే బయల్దేరిరా' అని టెలిగ్రాం రాగానే 'ఎవరికేమైందో' నని హడలి పోయి ఉన్న పళంగా రైలెక్కేసింది తను. తీరా అక్కడికెళ్లాక చూస్తే ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు కాని అంత కంటే ఘోర మైన పరిస్థితే ఎదురైంది.

తన అక్కయ్య సావిత్రి మతిపోయినదాన్లా ఉంది. బావ ఆఫీసుకు కూడా సెలవు పెట్టి చీటికి మాటికి అక్కయ్యను సాధించి ఆమెను మరింత పిచ్చిదాన్లా చేస్తున్నాడు.

తనను చూసేసరికి అక్కయ్యకు దుఃఖము ఆగలేదు. తనను రెండు చేతుల్తో చుట్టేసి భోరున ఏడ్చేసింది. అసలక్కడ ఏం జరిగిందో,ఆమె ఎందుకలా తనను పట్టుకుని ఏడుస్తోందో అర్థంకాక తను అయోమయంగా చూస్తూంటే బావ విసురుగా వచ్చి తన ముందు నిల్చున్నాడు.


"చూశావా శకుంతలా మీ అక్కయ్య చేసిన నిర్వాకం ? పిల్లల్ని భయ భక్తుల్లో ఉంచాలి అని నేను ఎంత మొత్తుకుంటున్నా వినలేదు. నాకు తెలీకుండా వాళ్ళను నెత్తికెక్కించు కుంది. ఇప్పు డేమో ఇద్దరం అనుభవిస్తున్నాం. .... తనకేం ఇంట్లో కూర్చుం టుంది ఏడుస్తూ కానీ నా సంగతలా కాదుగా ! బయట నలుగుర్లో తిరగాల్సిన వాణ్ని. పెద్ద ఉద్యోగం వెలగ బెడుతున్న వాణ్ని. నా పరువేం కావాలో ఎప్పుడైనా ఆలోచించిందా మీ అక్కయ్య ? హుఁ .... తలెత్తుకు తిరక్కుండా చేసారు అంతా కలిసి, ..." అంటూ చిందులు తొక్కడం మొదలెట్టాడు.

విషయం ఏమిటో అర్థంకాక ముందే తికమకగా వుంటే ఆయన మాటలు మరింత తికమక పెట్టేశాయి తనను. ఆయనంటే మనసులో కొంచెం భయంగా వున్నా పైకి గంభీరం నటిస్తూ - "అసలు విషయమేమిటో చెప్పకుండా ఇలా ఎవరికి వాళ్ళు నన్ను సస్పెన్సులో పెట్టేస్తే నేనేమనుకోవాలి ? .... అన్నట్టు పిల్లలేరి ? వాళ్ళనైనా అడుగుతాను సంగతేమిటో" .... అంటూ అక్కయ్య చేతులు విడిపించుకుని లోపలికి నడవ బోయింది, తను. అంతలో మళ్లీ ఏడుపు తన్నుకు రాగా మరోసారి గొల్లుమంది అక్కయ్య. "వాళ్ళు....లేరు సకూ...మళ్లీ వాళ్ళను చూస్తానా లేదో ..." అని చెప్పి వెక్కి వెక్కి ఏడ్చింది.

"అంటే .... ? వాళ్ళకేమయిందో చెప్పక్కయ్యా..." అంటూ అక్కయ్య భుజంపట్టుకుని ఊపుతూ కంగారుగా అడిగింది తను. అతి ప్రయత్నం మీద కొంచెం తమాయించుకుని సంగతి చెప్పింది అక్కయ్య. ఆమె కూతురు శశి తన క్లాస్‌మేట్ ఎవరో ముస్లిం అబ్బాయిని ప్రేమించి, ఇల్లు విడిచి అతనితో వెళ్ళి పోయిం దట. కొడుకు సుధాకర్ కారు దొంగిలించాడన్న ,నేరంపై పోలీసు కస్టడీలో ఉన్నాడట.

అది విని తనకు చాలా బాధేసింది. ఉన్నదే ఇద్దరు పిల్లలు. వాళ్లూ ఇలా పెడదారిని పడితె అక్కయ్య గతేం కావాలి ? అని జాలేసింది కూడా. ఆమె కొంచెం ఊరట చెందే వరకూ అక్కడ






వుండి ఈ రోజే అక్కడి నుంచి తిరిగొచ్చింది. సుధాకర్‌ని బెయిలు మీద విడుదల చేసినా, కోర్టుకు హాజరు కావడం, జరిమాన కట్టడం మాత్రం తప్పలేదు.

శశి, సుధాకర్ అలా తయారు కావడానికి బావే కారణం అని తన అభిప్రాయం. తండ్రినన్న అధికారంతో వాళ్ళను మరీ కట్టడిలో ఉంచాలని ప్రయత్నించడం వల్లనే కదా-వాళ్ళకు ఆ కట్టడి తెంచుకోవాలన్న కోరిక కలిగింది ? అదే వాళ్ళకు కాస్త స్వేచ్ఛ ఇచ్చి వాళ్ళను మరీ చిన్న పిల్లల్లా కాక కొంచెం పెద్ద వాళ్ళుగా గౌరవించి వుండే అప్పుడు వాళ్ళకు మంచి ఏదో గ్రహించే శక్తి అలవడి వుండేది. అందుకే అంటారు ఒక వయసొచ్చాక సొంత పిల్లలైనా సరే స్నేహితుల్లా చూడాలని. అప్పుడే వాళ్ళు తమ మనసులోని కోరికలను తల్లి దండ్రులతో చెప్పుకో గలరు. అవసరమైనప్పుడు సలహాలూ తీసుకో గలరు...

ఇది కేవలం తన అక్కయ్య ఇంట్లోనే కాదు, సాధారణంగా అందరిళ్ళలోనూ జరిగేదే.

శకుంతల తన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి వచ్చింది. తను మాత్రం పిల్లలనెప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. వాళ్ళను మరీ నిర్బంధంలో ఉంచాలని ప్రయత్నించనూ కూడదు. వాళ్ళకు తగినంత స్వేచ్ఛనివ్వాలి. అవసరమైతే డబ్బు కూడా ఇవ్వాలి. బొత్తిగా డబ్బు లేకపోతే దాన్ని సంపాదించడానికి వాళ్ళ మనసు పెడదారి పట్టే ప్రమాదం ఉంది

ఇలా అనుకున్న తరువాత నిశ్చింతగా నిద్ర పోగలిగింది శకుంతల.

o o o o

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలప్పుడు శకుంతల వంటింట్లో పనిచేసుకుంటోంది. ఆనందరావు పేపరు చదువుతూనే రెండవసారి కాఫీ తాగడంకోసం వంటింట్లో కొచ్చాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉండడం చూసి "పిల్లలింకా నిద్ర లేవలేదా?" అని అడిగాడు భార్యని.

"ఇంకా లేదండి..." అంది శకుంతల.

"ఛీ! ఇదేం పాడలవాటు వీళ్ళకు? ఎనిమిదైనా లేవకుండా ఇంకా నిద్రపోవడమేమిటి అసహ్యంగా? పైగా కాలేజి చదువులు వెలగబెడుతున్న ప్రబుద్ధులు కూడాను" అన్నాడు ఆనందరావు అసహనంగా.

"ఈరోజు కాలేజీకి సెలవండీ.... అందుకే నేనూ లేపలేదు" అని ఊరుకుంది శకుంతల. కొడుకు రెండోఆట సినిమా కెళ్ళాడనీ, కూతురు పన్నెండింటివరకూ నవల చదువుకుంటూ మేలుకుందనీ చెబితే ఇంకేమైనా ఉందా? వాళ్ళను వదిలేసి ముందు తనపని పడతాడు" అనుకుని మనసులోనే నవ్వుకుంది.

ఆమె కాఫీ కలిపి ఆనందరావుకు అందించేసరికి కూతురు ఉష ఆవలిస్తూ బెడ్‌రూంలోంచి ఇవతలికి వచ్చింది. బాత్‌రూంలో కెళ్ళబోతూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న తండ్రిని చూసి "గుడ్‌మార్నింగ్ డాడీ...." అనిచెప్పి వెళ్ళిపోయింది.


"మార్నింగ్" అని గొణిగి మళ్లీ పేపరులో తలమూర్చేశాడు ఆనందరావు.

మొహం కడుక్కుని వచ్చి తండ్రికెదురుగా మరో కుర్చీలో కూర్చుంది ఉష తల్లి అందించిన కాఫీ తాగుతూ "మమ్మీ.... నా డ్రెస్ సంగతి డాడీతో చెప్పావా?" అని అడిగింది.

"లేదమ్మా.... నువ్వే అడుగు" అని తనపనిలో మునిగిపోయింది. శకుంతల.

"డాడీ..! ఇప్పుడు కొత్తరకం డ్రెస్సు మార్కెట్లో కొచ్చింది. అప్పుడే మా ఫ్రెండ్సంతా కొనేశారు కూడాను. వాళ్ళంతా అవి తొడుక్కుని ఇంచక్కా కాలేజీకొస్తే నేనేమో వాళ్ళ మొహాలు చూస్తూ కూర్చోవాలి" అని- తండ్రి అంటే లోలోపల కొంచెం భయం ఉన్నా- ఎలాగో చెప్పేసింది ఉష.

ఆనందరావు పేపరు పక్కనపెట్టి వెక్కిరింతగా అన్నాడు "అసలు మీరు కాలేజీ కెళ్లేది చదువుకోడానికా లేక రోజుకో కొత్త



డ్రెస్సు వేసుకుని ఫాషన్ పెరేడ్ చేయడానికా?"

"అఁ.... అలా అడగకండి డాడీ.... ఎన్ని డ్రెస్సులున్నా ఇంకా కరువే దీనికి" అంటూ అక్కడికి వచ్చిన ప్రకాష్ గడియారం వంక చూస్తూనే అదిరిపడ్డాడు "ఓ మైగాడ్.... అప్పుడే ఏయిట్ ఫిఫ్టీన్. ఇంకో ఫిఫ్టీన్ మినిట్స్‌లో మా ఫ్రెండ్స్ వచ్చేస్తారు. మేమంతా క్రికెట్ ప్రాక్టీస్ కెళ్ళాలి. మమ్మీ.... ఓ కప్పు బోర్న్‌విటా, ఇంకా తినడానికేదైనా త్వరగా ఎరేంజ్ చేసేయ్!" అని హడావిడి చేశాడు. అప్పటికీ శకుంతల వంటగదిలోంచి రాకపోవడం చూసి "హరీ అప్ మామ్!" అని కేక పెట్టాడు.

కొడుకు అట్టహాసం చూసి ఆనందరావు కల్పించుకున్నాడు: "గాడిదా... ఇంతసేపూ దున్నపోతులా నిద్రపోయి ఆలస్యంగా నిద్రలేచింది నువ్వు. ఇప్పుడేమో అమ్మని తొందరపెడతావా? అంత వెళ్ళాలనుకున్నవాడివి ఇంకాస్త ముందు లేవచ్చుగా! అప్పుడీ అవస్థ ఉండేది కాదుగా! నీ ఇంగ్లీష్ మాటలూ, నువ్వూనూ..." అని మందలించాడు.

ప్రకాష్ ఖిన్నుడుచ్చుకుని "పోన్లె మమ్మీ.... ఓన్లీ బోర్న్‌విటా ఇచ్చేయ్ చాలు. తినడానికేం వద్దు.... పాపం ఊరికే నీకెందుకు ట్రబుల్?" అన్నాడు.

శకుంతల నవ్వుతూ బయటకి వచ్చింది. "అబ్బబ్బ! నీకన్నిటికీ తొందరేరా! నువ్వెళ్ళి ముందు ముహం కడుక్కురా! ఈలోగా నేను బ్రెడ్డుకు వెన్న, జాం రాసిస్తాను" అంది కొడుకువైపు మురిపెంగా చూస్తూ.

"థ్యాంక్యూ మామ్!" అని అరుస్తూ బాత్‌రూంలోకి పరుగెత్తాడు ప్రకాష్.

"వెధవ చదువూ వీడూను... ఓ మంచీ మర్యాదా ఏమక్కర్లేదు" అని విసుక్కున్నాడు ఆనందరావు.

ప్రకాష్ మొహం కడుక్కురాగానే అతని ముందు టిఫిన్ ప్లేటు ఉంచింది శకుంతల. ఉష మెల్లిగా లేచి వచ్చి తమ్ముడి పక్కన కూర్చుని వాడి చెవి మెలిపెడుతూ "ఇందాక ఏమన్నావ్? ఎన్ని డ్రెస్సులున్నా నాకు కరువా? నీకు లేవేం పాపం? వార్డ్‌రోబ్ నిండా బట్టలున్నా ఇంకా జీన్స్ ప్యాంట్ అనీ, అదనీ, ఇదనీ కొంటూనే ఉంటావుగా?" అంది.

"బాబోయ్!" అని అరుస్తూ తన చెవి విడిపించుకుని "ఏమైనా నీ అంత పిచ్చి నాకు లేదులే!" అన్నాడు ప్రకాష్ ఓ చేత్తో టిఫిన్ తింటూనే.

"ఇప్పుడు అనవసరంగా కొత్త డ్రెస్సు లెందుకు ఉషా... డబ్బు దండగ కాకపోతే!" అన్నాడు ఆనందరావు.

తండ్రి మాట విని ఉష తల్లి వైపు అర్థింపుగా చూసింది.

శకుంతల జోక్యం చేసుకొని "పోనీలెండి... ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తొడుక్కుంటుంది? అయినా కాలేజీలో చదివినన్ని రోజులేగా ఏ సరదా అయినా? ఆ తరువాత మామూలే..." అని కూతురికి వత్తాసు పలికింది.

"ఎంతవుతుందేమిటి?" అయిష్టంగానే అడిగాడు ఆనందరావు

"ఓన్లీ ఫైవ్ హండ్రెడ్ డాడీ...!" ఉత్సాహంగా అంది ఉష.



"మై గాడ్ అయిదు వందలే...?" అంటూ ఆనందరావు దీర్ఘం తీయగానే శకుంతలకు కోపం వచ్చింది.

"ఏమిటండీ మీరు మరీను.... మనకేం లేదా పోదా? ఉన్న ఇద్దరి పిల్లల సరదా తీర్చడంలో కూడా పీనాసితనం చేస్తే ఎలా చెప్పండి?" అంది.

"పీనాసితనం కాదు సక్కూ... అనవసరంగా డబ్బు ఖర్చు చేయడం నాకిష్టం ఉండదంతే!" అని నచ్చ చెప్పాలని చూశాడు ఆనందరావు.

ఉష అలిగి మూతి ముడుచుకుంది. "నేనేమంత పెద్ద వేలు ఖరీదు చేసే వస్తువులడిగానని? ఆఫ్టరాల్ ఓ కొత్త డ్రెస్సు అంతేగా? పోన్లెండి.... మీకిష్టం లేకపోతే ఏం కొనివ్వక్కర్లేదు" అంది.

"ఛ! ఈ మాత్రానికే ఎందుకలా ఇదవుతావు ఉషా... నాన్న కొనిస్తారులే...!" భర్త తరుపున తానే హామీ ఇచ్చేసింది శకుంతల.

"నీకేం ఎన్నయినా చెబుతావ్. కష్టపడి సంపాదించే వాడికి తెలుస్తుంది డబ్బు విలువ" అని రుసరుసలాడాడు ఆనందరావు.

అంతటితో అప్పటి సమావేశం ముగిసింది.

సాయంకాలం ఇంటికిరాగానే అలగడం ప్రకాష్ వంతయింది.

"ఏమైనా ఈ రోజుల్లో ఆడవాళ్ళ మాటకే విలువెక్కువ" అన్నాడు ప్రకాష్.

"ఇప్పుడు యువరాజుగారికేం లోటొచ్చిందో?" వ్యంగ్యంగా అడిగాడు ఆనందరావు.



"దానికైతే అడిగిందల్లా కొనిస్తారుగానీ నేనెప్పట్నించో ఏడుగుతున్న దాన్ని కొనిచ్చారేంటి?"

"నువ్వేమడిగావసలు?" నిజంగానే జ్ఞాపకం లేక అడిగాడు ఆనందరావు కొడుకువైపు కుతూహలంగా చూస్తూ

"నేనిప్పుడు కాలేజీలో చదువుతున్నాను కదా.... మరి నాకో స్కూటరు వద్దేంటి?"

"అబ్బో.... చాలా చిన్న వస్తువే అడిగావే పాపం...?"

తండ్రి మాటల్లోని వ్యంగ్యాన్ని అర్థం చేసుకోక మామూలుగా తన ధోరణిలోనే అన్నాడు ప్రకాష్ : "కొత్త స్కూటరే కావాలని అడగడం లేదు నేను. సెకండ్ హాండ్దైనా సరే... అదీ కాకపోతే కనీసం లూనా కొనిచ్చినా సంతోషమే"

"మా నాయనే.... నా మీద ఎంత జాలి నీకు! అదలా వుంచు. ఇప్పుడు నీ వయసెంత బాబూ?"

"పదహారు" ధీమాగా అన్నాడు ప్రకాష్.

"అయితే ఇంకో రెండేళ్ళాగాలి తమరు"

ప్రకాష్ కప్పుడే ఉక్రోషం వచ్చేసింది. "ఏం? ఎందుకు ఆగాలి? మా ఫ్రెండు రవికి కూడా నా వయసే. మరి వాళ్ళ నాన్న గారు వాడికి కొత్త స్కూటరు కొనివ్వలేదేమిటి?" అని చెప్పి అంతలో ఏదో గుర్తొచ్చినట్లు "పైగా ఆయన పెద్ద పోలీసాఫీసరు కూడాను" అన్నాడు తన మాట సమర్థించుకుంటూ ప్రకాష్.

ఆనందరావు ఓ సారి గట్టిగా చిటికేసి "అదీ సంగతి అలా చెప్పు. ఆ ధీమాతోనే కొనిచ్చి వుంటాడు ఆయన. తన ఉద్యోగ ప్రభావం వల్ల కొడుకు పట్టుబడకుండా చూసుకోగలడు. లేకపోతే దొంగ లైసెన్స్ ఇప్పించనూ గలడు. ఒకవేళ వాళ్ళ కొడుకు ఫ్రెండువన్న అభిమానంతో నీకూ ఓ లైసెన్స్ ఇప్పించగలడనుకో కానీ నాకది ఇష్టం లేదు. ఎందుకంటే పిల్లలకు బాధ్యత తెలిసి రావాలని. జాగ్రత్తగా మసులుకోవటంచేతకావాలని. దురుసుతనం తగ్గాలని. అప్పుడే ఏ వాహనాన్నయినా నడపడానికి వాళ్ళు అర్హులవుతారు. ఈ దృష్టితోనే ప్రభుత్వం ఓ రూలంటూ పెట్టింది. అది చాలా కరెక్ట్ అని నా అభిప్రాయం. నీకు పద్దెనిమిదేళ్ళు రానీ.... అప్పుడు లూనా ఏం కర్మ, స్కూటరే కొనిస్తాను" అన్నాడు.

"ఊఁ.... ఏమిటి డాడీ మీరు మరీను... నాకిప్పుడు పదిహేడో ఏడు కూడా సగం వెళ్ళిపోయింది తెలుసా? అయినా నా పర్సనాలిటీ చూసి అందరూ నా కిరవై ఏళ్ళుంటాయనుకుంటున్నారు. అదీగాక మా ఫ్రెండ్స్ దగ్గరున్న స్కూటర్లను నడిపి నాకిప్పటికే బాగా ఎక్స్పీరియన్స్ వచ్చేసింది. అంతే కాదు. ట్రాఫిక్ రూల్సు, వెహికల్స్‌ని మెయింటైన్ చేయడం—అన్నీ తెలుసు నాకు డాడీ!"

"నువ్వెన్నయినా చెప్పు.... నేను మాత్రం ఇప్పుడు కొనివ్వనంటే కొనివ్వను అంతే" దృఢమైన కంఠస్వరంతో అన్నాడు ఆనందరావు. మళ్ళీ అంతలోనే "అయినా నువ్వే అంటున్నావు కదరా– పదిహేడవయేడు కూడా సగం వెళ్ళిపోయిందని. ఇంకో ఏణ్నర్థం ఆగితే తప్పేమిటి చెప్పు" అన్నాడు అనునయిస్తున్నట్లుగా.

శకుంతలకు కొడుకును చూస్తే జాలేసింది : "వాడన్నది



నిజమే. పదిహేనవయేటే వాడు స్కూటరు నడపటం నేర్చుకున్నాడు. పైగా దాని మీద కూర్చుంటే వాడెంతో దర్జాగా, ఠీవిగా కనిపిస్తాడు కూడా" అనుకుంటూంటే ఆమెకు చటుక్కున సుధాకర్ గుర్తుకొచ్చాడు. వాళ్ళ నాన్న తన కారును ముట్టుకోనివ్వనందుకేగా వాడు ఎవరిదో కారు దొంగతనంగా డ్రైవ్ చేసి సరదా తీర్చుకోబోయాడు! ఇప్పుడు తన భర్త కూడా అదే పొరపాటు చేస్తున్నాడు. వాళ్ళు ఎంతసేపూ తమ పైపే ఆలోచిస్తారు గానీ పిల్లల దృష్టితో ఒక్కమారైనా ఆలోచించరేం? అనిపించింది ఆమెకు.


తరువాత వీలు చూసుకుని భర్తతో ఈ విషయం మాట్లాడాలని మనసులోనే నిర్ణయించుకుంది శకుంతల.

ప్రకాష్ ఫ్రెండు వచ్చి పిలవడంతో ప్రకాష్ హడావుడిగా లేచి వెళ్ళిపోయాడు. ఆనందరావు పేపరు చేతబట్టుకుని హాల్లోకి వెళ్ళగా ఉష తన గదిలోకి, శకుంతల వంటగదిలోకి వెళ్ళిపోయారు. అప్పటికి ఆ సమావేశం అలా ముగిసింది.

పొద్దుటి పూట సరిగ్గా భోజనం చేయడానికి ఎవరికీ తీరిక ఉండదు కాబట్టి శకుంతల ఏమైనా చేయదల్చుకుంటే రాత్రిపూటే చేస్తుంది. ఆ రోజు కూడా అలాగే పిల్లల కిష్టమని ఆలూ బాత్, మైసూర్ పాక్, టొమేటో పెరుగుపచ్చడి అన్నీ చేసింది. కానీ సాయంకాలం బయటికి వెళ్ళిన ప్రకాష్ రాత్రి ఎంతకీ ఇంటికి రాలేదు. వాడికోసం ఎదురు చూసి చూసి విసుగు పుట్టి చివరికి తొమ్మిది గంటలకి మిగిలిన ముగ్గురూ భోజనానికి కూర్చోబోతుండగా ప్రకాష్ దగ్గం నుంచి ఫోన్ వచ్చింది. "మా ఫ్రెండ్ బర్త్‌డే మమ్మీ.... నన్ను అసలు వదిలిపెట్టడం లేదు, పార్టీ అయ్యేసరికి బాగా లేటవవచ్చు. అందుకని రాత్రి నేను ఇంటికి రాను" అని చెప్పాడు.

శకుంతల "నీకిష్టమైన వంటలన్నీ చేసేను కదరా!" అన్నందుకు "సారీ మమ్మీ... అయాం వెరీ వెరీ సారీ... మీరు ముగ్గురూ హేపీగా తినేయండి" అని చెప్పి ఫోను పెట్టేశాడు.

సంగతి తెలుసుకున్న ఆనందరావు "వెధవలకిదో ఫాషనయిపోయింది. దున్నపోతుల్లా ఎదిగాక కూడా బర్త్‌డేలూ, పార్టీలూ



అంటూ అర్థరాత్రిదాకా రికార్డులు పెట్టుకుని కోతుల్లా గెంతడం..." అన్నాడు మండిపడుతూ.

ఆ మాటకి ఉష కిసుక్కున నవ్వింది. శకుంతలకు కూడా నవ్వొచ్చినా భర్త సీరియస్‌నెస్ చూసి బలవంతాన ఆపుకుంది.

భోజనాలయ్యాయి. శకుంతల వంటిల్లు సర్దుతూంటే మెల్లిగా అక్కడికి వచ్చింది ఉష. కాలి బొటన వేలు నేలకి రాస్తూ "మమ్మీ...." అని పిలిచింది.

శకుంతల చటుక్కున ఇటు తిరిగి "ఏమిటే!" అంది కూతురి ధోరణికి విస్తుపోతూ. ఏం కావాలన్నా నేరుగా అడగడమే గానీ ఇలా నానుస్తూ నిలబడదు ఎప్పుడూ.

"మరే... మరే.... మా ఫ్రెండు పూర్ణిమలేదూ....వాళ్లింట్లో వాళ్ళంతా నాలుగు రోజులు సరదాగా గడిపిరావడానికి వాళ్ళ తోట బంగళాకి వెళుతున్నారట. నన్ను కూడా రమ్మని బలవంతం చేస్తోంది పూర్ణిమ. అసలు తనే రేప్పొద్దున నీ పర్మిషన్ తీసుకోడానికి ఇక్కడికి వస్తుందనేలే!" అని చెప్పింది.

శకుంతల క్షణం ఆలోచించి "ఓస్ ఇంతేగా? నీకు వెళ్ళాలనుంటే వెళ్ళిరా ఉషా" అంది.

ఉష "థ్యాంక్‌యూ మమ్మీ ... " అంటూ తల్లి చేతులు రెండూ పట్టుకుని గట్టిగా ఊపేసింది. సంతోషంతో గాలిలో తేలిపోతున్నదానిలా తన గదిలోకి వెళ్ళిపోయింది.

శకుంతల వెళ్ళిపోతున్న ఉషకేసి అభిమానంగా చూసింది. "తన పిల్లలు నిజంగా ఎంతో మంచివాళ్ళు. తనను అడగందే ఏ పనీ చేయరు వాళ్లను తాము మరీ అంత కట్టడిలో పెట్టకం లేదనీ, అనవసరంగా వారిమీద అథారిటీ చెలాయించడం లేదనీ వాళ్ళకు తెలుసుకాబట్టే తల్లిదండ్రులంటె అంత ప్రేమ వాళ్ళకు" అనుకుంది గర్వంగా.

రాత్రి పడుకోబోయే ముందు ఉష సంగతి భర్తతో చెప్పింది శకుంతల. ఆమె చెప్పిన మాట వింటూనే ఆనందరావు ముఖం గంభీరంగా మారిపోయింది. "పూర్ణిమ అంటే ఎవరు? క్రికెట్ ప్లేయర్‌నని చెప్పుకుని తిరుగుతాడే నాగరాజ్ అనే కుర్రాడు, అతని చెల్లెలేనా? తోటలోని బంగళాకి వాడుకూడా వెళతాడేమో ....? నాకెందుకో వాడి వాలకం చూస్తేనే ఒళ్ళుమంట. వాళ్లతో మన మ్మాయి ఎక్కువ స్నేహం చేయడం కూడా నాకిష్టంలేదు" అన్నాడు.

"మీరు మరీనండీ ... ఆ కుర్రాడు కాస్త స్టైయిల్‌గా ఉంటాడు ... జుట్టు పొడుగ్గా పెంచుకున్నాడు. అందుకే అతనంటే మీకు గిట్టదు.అసలు ఫాషన్‌గా ఉన్నవాళ్ళందరూ చెడ్డవాళ్లని ఎందుకనుకోవాలి? అయినా ఇంట్లో వాళ్ళందరూ వెళుతున్నారు కాబట్టి అతనూ వెళ్తాడేమో మరి!"

"ఏమైనా సరే .... నువ్వు వాళ్ళింటికి ఫోన్‌చేసి నిజంగా ఎవరెవరెళుతున్నారో తెలుసుకో!"

"ఉషను పంపమని అడగడానికి రేపు పూర్ణిమ ఎలాగూ వస్తుందిగా ఆ అమ్మాయినే అడుగుతాను ఎవరెవరెళుతున్నారని".

"అంతకంటే వాళ్ళమ్మకు ఫోన్‌చేసి కనుక్కోవడమంటే మన పిల్లలమీద మనకు నమ్మకం లేదనేగా అర్థం? అదీకాక పూర్ణిమా వాళ్ళమ్మతో తనకసలు అట్టే పరిచయంలేదు కూడాను...అని ఆలోచిస్తూ పడుకుంది శకుంతల.

అందుకే ఒక్కోసారి భర్త ధోరణి అసలు నచ్చదు తనకు. పిల్లలకు తగినంత స్వేచ్ఛనివ్వాలని తన అభిప్రాయం. వాళ్ళ మంచీ చెడులు వాళ్ళు తెలుసుకునే వయసు వాళ్ళకు వచ్చిందని తన నమ్మకం. కానీ భర్త వాళ్ళనింకా చిన్న పిల్లలుగానే భావిస్తాడు. ప్రతీదీ మనం చెబితేగానీ వాళ్ళు తెలుసుకోలేరనుకుంటాడు.

ఇలా ఆలోచిస్తుంటే చప్పున ప్రకాష్ స్కూటరు సంగతి గుర్తుకొచ్చింది శకుంతలకు. "ఏమండీ....మరి ప్రకాష్ స్కూటరు గురించి ఏమాలోచించారు?" అని అడిగింది.

"ఆలోచించడానికేముంది ఇందులో. ఇంకో రెండేళ్లాగితే కొనిస్తానన్నానుగా....అంతే!" ఆనందరావు నిర్ధారణగా అన్నాడు.

"అయినా మీరనుకున్నంత కేర్‌లెస్ మనిషికాడు మన ప్రకాష్" కొడుకును సమర్థిస్తూ అంది శకుంతల.

"వాడు కేర్‌లెస్ మనిషి కాకపోవచ్చు. కానీ ఆ వయసు అలాంటిది".


"అదేం కాదు....స్కూటరు కొనాలంటె బోలెడంత డబ్బవుతుందని మీ భయం కదూ?"

ఆ మాట విని ఆనందరావుకు కోపం వచ్చింది.

"ఛ! నీ ఆలోచనలన్నీ నెగిటివ్‌గానే వుంటాయి ఎప్పుడూ. నేను ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకోవేం? వాడు కాస్త పెద్దవాడై బాధ్యత తెలుసుకోవాలి అంటున్నాను అంతేగా?" అన్నాడు.

భర్త కోపాన్ని తగ్గించాలని "అది కాదండీ .... బాధ్యత తెలీదు అని ఊరుకుంటె వాళ్ళకది తెలిసేదెలా? మనమే కొన్ని బాధ్యతలను వాళ్లకప్పగించాలి అప్పుడే వాళ్ళు వాటిని నిర్వహించ గల శక్తిని సంపాదించుకుంటారు; అలవర్చుకుంటారు....ఈ మాట నేనెందుకింత గట్టిగా చెబుతున్నానంటె మా అక్కయ్య ఇంట్లో జరిగిందే మనింట్లో కూడా జరక్కూడదని అంతె!" అంది అనునయిస్తున్నట్టుగా.

"నీ వరస చూస్తుంటే – పిల్లలకు వాళ్ళడిగినంత డబ్బిస్తే వాళ్ళకు డబ్బు దొంగిలించే అవసరం రాదు. అలాగే వాళ్ళు అడిగిందల్లా కొనిస్తే మరొకరి వస్తువుకు చేయిచాచే పాడుబుద్ధి పుట్టదు. కొడుకులను గర్ల్‌ఫ్రెండ్స్‌తో తిరగనిస్తే వాళ్ల చెడుమార్గాలు తొక్కే-



అవకాశం ఉండదు. అలాగే కూతుళ్ళను బాయ్ ఫ్రెండ్స్‌తో తిరగనిస్తే వాళ్ళు చెడిపోయే అవకాశం ఉండదు పిల్లలకు ఎంత స్వేచ్ఛ ఇస్తే అంత మంచిది. దీనివల్ల ఎలాంటి ప్రమాదం ముంచుకు రాదు-అనేలా వున్నావ్ అంతేకదూ? చాలా బాగుంది నీ ఫిలాసఫీ!"

శకుంతల చటుక్కున లేచి కూర్చుంది "ఛీ! ఛీ! అవేం పాడు మాటలండీ....? అంత అసహ్యంగా నేను ఆలోచిస్తానా? వాళ్ళా ప్రవర్తిస్తారా? అయినా ఈమధ్య ప్రతిదానికీ ఇలా ఎత్తి పొడవడం బాగా అలవాటు చేసుకున్నారు మీరు" అంది. ఆమె మాటల్లో నిష్ఠూరం ధ్వనించింది.

"ఇదిగో...పిల్లలను అతిగారాబంచేసి చెడగొట్టడం నాకిష్టం లేదు అంతే, ఇక పడుకో....నాకు నిద్దరొస్తోంది" అనేసి అటుతిరిగి పడుకున్నాడు ఆనందరావు.

శకుంతల మరేం మాట్లాడలేక మౌనంగా పడుకుంది.

✱ ✱ ✱

మర్నాడు ఉష అన్నట్టుగానే పూర్ణిమ వచ్చింది శకుంతల పర్మిషన్ కోసం. "ఎవరెవరు వెళుతున్నారు పూర్ణిమా?" అని అడిగింది శకుంతల.

పూర్ణిమ తడబడింది. "ఆఁ.... మేమంతా వెళ్తున్నాం ఆంటీ. ఒకవేళ మా అమ్మమ్మ మాత్రం రాకపోవచ్చు అంతే!"

"పోన్లె మీ అమ్మమ్మ సంగతి కామగానీ మీరందరూ నాలుగు రోజుల్లో తిరిగొచ్చేస్తారుగా?"

"ఆఁ...వచ్చేస్తాం ఆంటీ మా కారు తీసుకెళ్తున్నాం.నాలుగు రోజుల్లో తప్పకుండా తిరిగొచ్చేస్తాం" హామీ ఇస్తున్నట్టుగా అంది పూర్ణిమ.

"అయితే ఉషను పంపిస్తాలే!" అంది శకుంతల.

పూర్ణిమ మొహం వికసించింది. "థ్యాంక్యూ ఆంటీ.... నిజంగా మీలాంటి అమ్మ ఉన్న ఉష చాలా లక్కీ" అంది సంతోషంతో.

ఆ పొగడ్త విని శకుంతల పొంగిపోయింది.

పూర్ణిమ వెళ్ళిపోయాక "నువ్వయితే పంపిస్తానంటున్నావు కానీ నాన్న ఏమంటారోనమ్మా...." అన్న సందేహాన్ని వెలిబుచ్చిన ఉషతో "నేనంతా ఒప్పించాలే ఆయన్ని. అయినా మీరింకా చిన్న పిల్లలే అనుకుంటున్నారు మీనాన్న. అందుకే ప్రతిదానికీ ముందు వద్దనేస్తారు", అంది శకుంతల.

"నాన్నగారు మా మంచికే కదమ్మా చెప్పేది? కొన్ని కొన్ని విషయాల్లో పెద్దవాళ్ళు చెప్పినట్టు వింటేనే పిల్లలకు హాయి" అని తండ్రిని సమర్థించింది ఉష.

"నా తల్లే..." అని మురిసిపోయింది శకుంతల. 'నిజంగా నా పిల్లలు రత్నాలు' అనుకుంది మనసులో.

మరుసటిరోజు ఉదయం ఆరుగంటలకే ఇంటి ముందు కారు వచ్చి ఆగింది. హారన్ వింటూనే అప్పటికే సిద్ధంగావున్న ఉష తల్లి సర్దిపెట్టిన బాగ్ అందుకుని బయలుదేరింది. "నేనెళ్లొస్తానమ్మా .... నాన్నగారితో చెప్పు." అనేసి గబగబా వెళ్ళి కార్లో కూర్చుంది. శకుంతల వాకిట్లోకి వచ్చి చూసేలోగా కారు బయలుదేరి




అలనాటి చరిత్రలే ఈనాటి మేటి నవలలు

శ్రీ ప్రసాద్ రచనలు

సురాజుద్దౌలా (విజయసీరియల్) 18/-
షాజహాన్ " 13/-
విజయనగర పతనం-I " 13/-
విజయనగర పతనం-II " 12/-
సామ్రాట్ శ్రీరంగరాయ " 10/-
ఆర్య చాణక్య " 13-50
యుగంధర్ " 13-50
అప్పాజీ " 12/-
రోషనార " 10/-



లల్లాదేవి రచనలు

ఛత్రపతి శివాజీ 20/-
తిరుచరణాలు 20/-
(ఆంధ్రపత్రిక సీరియల్)
సామ్రాట్ అశోక్-I 15/-
సామ్రాట్ అశోక్-II 12/-
(ఆంధ్ర జ్యోతి సీరియల్)
గలగలా గోదారి (ఆంధ్రజ్యోతి సీరియల్) 16/-
(ఆర్య అనార్యుల సంగ్రామ చరిత్ర)
లకుమాదేవి 15/-
(ఆంధ్రభూమి సీరియల్)
క్షేత్రపతి (చారిత్రక గాథ) 20/-

మీ దగ్గరి బుక్ షాపుల్లో కొనండి లేదా
కోరిన పుస్తకం ధరలో రు. 10/- M.O. పంపండి.
మిగిలిన మొత్తానికి V.P.P. లో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2

వెళ్ళిపోయింది కూడాను.

అప్పుడే నిద్రలేచి వచ్చిన ఆనందరావు భార్య వాకిట్లో నిలబడి వుండడం చూసి "ఏమిటి చూస్తున్నావ్ సక్కూ....?" అని అడిగాడు.

"పూర్ణిమావాళ్ళ కారొచ్చిందండీ....ఉష వెళుతుంటేనూ.... చూస్తూ నిలబడ్డాను." అంది శకుంతల.

"అలాగా....పూర్ణిమా వాళ్ళమ్మగారితో మాట్లాడావా ?"

"ఎక్కడా....నేను బయటికొచ్చేలోగా కారు కదిలిపోయింది. ఎండెక్కేలోగా తోటకు చేరుకోవాలని తొందర కాబోలు వాళ్ళకి"

"నిజమేలే...ఆ.... లోపలికి పద నాకు కాఫీ కలిపిద్దువు గాని." అంటూ లోపలికి నడిచాడు ఆనందరావు. శకుంతల కూడా ఆతన్ని అనుసరించింది.

ఆరోజు ఆనందరావు ఆఫీసుకి, ప్రకాష్ అతని ఫ్రెండింటికీ వెళ్ళిపోయాక శకుంతల కసలు ఏం తోచలేదు. మధ్యాహ్నమంతా ఎలాగో గడిచింది కానీ సాయంత్రమవుతూంటే మాత్రం ఏమిటో పిచ్చెక్కినట్టుగా అనిపించ సాగింది.

దానికి తగ్గట్టు ఆఫీసులో పని ఎక్కువ వుందంటూ ఫోన్ చేసి, రాత్రి తొమ్మిదింటికి ఇల్లు చేరాడు ఆనందరావు. ప్రకాష్ అసలు ఇంటికే రాలేదు.

మర్నాడు మధ్యాహ్నంవరకూ కూడా ప్రకాష్ ఇంటికి రాక పోయేసరికి శకుంతలకు కంగారు పట్టుకుంది. ప్రకాష్ ఫ్రెండు రవి ఇంటికి ఫోన్‌చేసింది కానీ అక్కడ ఎవరూ ఫోనె త్తకపోయేసరికి ఆమె కంగారు మరింత ఎక్కువయింది. ఇంట్లో కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతూండగా అంతలో వీధి తలుపు గట్టిగా తట్టిన చప్పుడైంది. 'ప్రకాష్ అయితే ఇంత గట్టిగా తలుపు కొట్టడే?' అనుకుంటూ వచ్చి తలుపు తీసిన శకుంతల గుమ్మంలో పోలీసులను చూసి నిశ్చేష్టురాలయింది.

"ఆనందరావుగారిల్లు ఇదేనాండీ.... ?" అన్న పోలీసుల ప్రశ్నకు "అవును అని అతి కష్టంమీద సమాధానం చెప్ప గలిగింది.

"మీ అబ్బాయి ప్రకాష్‌కు ఆక్సిడెంట్ అయిందమ్మా.... హాస్పిటల్లో ఉన్నాడు రవి అనే అతని స్కూటరు నడిపిస్తూంటే లారీకి గుద్దుకుంది. అదృష్టం బాగుండి మీ అబ్బాయికి అట్టేదెబ్బలు తగల్లేదుకానీ ఆ రవి అనే అబ్బాయి మాత్రం అక్కడికక్కడే చచ్చిపోయాడు". నిర్వికారంగా చెప్పాడు పోలీసుల్లో ఒకతను.

పిడుగుపడ్డట్టుగా ఒణికిపోయింది. శకుంతల. ఒళ్ళంతా చెమటలు పట్టేసింది. కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. నోరు తడారి పోయి, నాలుక అతుక్కుపోయి మాటపెగలడమే కష్టమైపోయింది.

"ఏమిటీ.... ప్రకాష్ ఫ్రెండ్ రవి చచ్చిపోయాడా?" అని అడిగింది. తడబడుతూ.

"అవునమ్మా.... ఏం చెప్పమంటారు? ఈ డబ్బున్నవాళ్ళ పిల్లలంతా ఇంతే. చిన్న వయసుకే పెద్దపనులు చేసేయాలన్న తొందర వాళ్ళకి. తండ్రులు పిల్లలను పట్టించుకోరు. తల్లులు వాళ్ళను అతి గారాబం చేసి డబ్బిచ్చి పంపుతారు. అందుకే పట్టుమని పదహారేళ్ళు వచ్చేసరికి సిగరెట్లు కాల్చడం, డ్రింక్స్‌తాగడం, ఆడపిల్లల వెంటబడటంలాంటి దురలవాట్లన్నీ అలవడతాయివాళ్ళకి. ఇక దీనితో ఓ బండివుంటే ఇక చెప్పనే అక్కర్లేదు. కోతికి కొబ్బరికాయ దొరికినట్లే వాళ్ళు తమ ప్రాణాలతో చెలగాటాలాడుకుని చివరికి మా ప్రాణంమీదికి తెస్తారు...." అని ఇంకా ఏమేమో చెప్పాడు కాన్‌స్టేబుల్.

శకుంతల ఎలాగో ఇంటికి తాళంవేసింది. పోలీసులు అటు పోగానే ఆటోలో హాస్పిటల్‌కు బయల్దేరింది.

దారి పొడుగునా ఆమెకు ఆ పోలీసు చెప్పినమాటలే చెవుల్లో గింగురుమన్నాయి- "తల్లులు అడిగినంత డబ్బిచ్చి పిల్లలను పాడు చేస్తున్నారు.... వాళ్ళ చేతికి బండి దొరికిందంటే కోతికి కొబ్బరి కాయ దొరికినట్టే!" అని.


చప్పిన తన భర్తమాటలు గుర్తుకొచ్చాయి ఆమెకు. ఆయన చెప్పింది ఎంత నిజం? తనే ఊరికే ఆయన్ని అపార్థం చేసుకుంది. పిల్లలమీద ఆయనకి ప్రేమలేదని అపోహపడింది....

ఆటో హాస్పిటల్ చేరుకోగానే శకుంతల గబగబాదిగి ఆటో వాడికి డబ్బిచ్చి దాదాపు పరుగెత్తినట్టుగా లోపలికి నడిచింది. తలకి పెద్ద బాండేజీతో మంచంమీద స్పృహలేకుండా పడివున్న ప్రకాష్‌ని చూసేసరికి ఆమెకు దుఃఖం ఆగలేదు. మెల్లిగా దుప్పటి తొలగించి చూసింది, ఒంటిమీద కూడా అక్కడక్కడ కట్లు కట్టివున్నాయి. "అయ్యో... ఎంతపని చేసుకున్నావురా నాయనా..." అని లోలో పల కుమిలిపోతూ మంచంపక్కనే స్టూలుమీద కూర్చుంది.

కాసేపటికి ఆనందరావు వచ్చాడు హడావిడిగా అతని మొహంలో ఆదుర్దా, ఆందోళన కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"ఎలా ఉన్నాడు?" అని అడిగి "రవి వాళ్ళింట్లోంచి ఫోనొస్తే సంగతి తెలిసింది. వెంటనే వచ్చేశాను" అంటూ మంచం దగ్గరికి చేరుకున్నాడు ఆనందరావు.

కొడుకును ఆ స్థితిలో చూసి అతనికీ గుండె బరువెక్కింది. కళ్ళు చెమ్మగిల్లాయి. అయినా తమాయించుకుని నిశ్శబ్దంగా ఏడుస్తున్న శకుంతల భుజంమీద చెయ్యివేసి ఓదారుస్తూ "ఏడవకు సక్కూ... త్వరలోనే మన ప్రకాష్‌కి నయమైపోతుంది. నువ్విక్కడే ఉండు. నేవెళ్ళి డాక్టరుదగ్గర మాట్లాడివస్తాను" అని చెప్పి వడివడిగా నడుస్తూ బయటికి వెళ్ళిపోయాడు ఆనందరావు.



శకుంతల ప్రకాష్ ముఖాన్ని ప్రేమతో నిమిరింది. "నా బాబు నాకు దక్కితే చాలు" అని మనసులోనే కోరుకుంటూ మౌనంగా కూర్చుంది.

పదినిమిషాల్లో ఆనందరావు తిరిగొచ్చారు. "తల నుంచి రక్తం బాగా పోయిందట. అసలు మెదడుకు కూడా ఏమైనా దెబ్బ తగిలిందేమోనని అనుమానంగా ఉందిట. స్పృహ వచ్చిన తరువాత ఎక్స్‌రే తీస్తేగానీ సరిగ్గా తెలీదట. 'డబ్బుకోసం వెనకాడకండి. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. మా బాబును మామూలు మనిషిగా చేస్తేచాలు'- అని చెప్పివచ్చాను" అన్నాడు.

అంతలో అతనికి ఉష సంగతి గుర్తొచ్చింది. "సక్కూ.... మనమిప్పుడు ముందు ఉషనిక్కడికి పిలిపించాలి, పూర్ణిమావాళ్ళ తోటబంగాళా ఎడ్రెస్ ఉందా?" అని అడిగాడు హఠాత్తుగా.

శకుంతల లేదన్నట్టుగా తలూపింది.

"అయ్యో ఇప్పుడెలా మరి?" అని క్షణం ఆలోచించిన ఆనందరావు "పోనీ ఓ పనిచేయ్. పూర్ణిమావాళ్ళింటికి ఫోన్‌చేసి వాళ్ళ తోటబంగాళా ఎడ్రెస్ కనుక్కో-" అన్నాడు.

శకుంతల లేచి ఫోనుదగ్గరికి వెళ్ళింది. అక్కడున్న డైరెక్టరీలో చాలా సేపు వెదికి చివరికి పూర్ణిమావాళ్ళ నంబరు కనుక్కోగలిగింది. కనీసం వాళ్ళ అమ్మమ్మయినా ఇంట్లో ఉండకపోతుందా అనుకుంటూ ఫోన్ చేసింది. కానీ అటునుంచి పూర్ణిమావాళ్ళమ్మ గొంతే వినబడేసరికి శకుంతలకు ఆశ్చర్యం ఆగలేదు.

"అదేమిటండీ.... మీరు తోట బంగళాకి వెళ్ళలేదూ?" అని అడిగింది.

ఆవిడ అంతకంటె ఆశ్చర్యపోయి "తోటబంగళాకా? నేనా? ఎందుకు?" అని ప్రశ్నించింది.

"మీ ఫ్యామిలీ అంతా వెళ్తున్నారనీ, సరదాగా నన్నూ రమ్మంటున్నారనీ చెప్పి మా ఉష కూడా బయల్దేరివెళ్ళింది. అసలు పూర్ణిమే వచ్చి "ఉషను పంపించండి" అని అడిగితే పంపించాను" అంది శకుంతల.

"అలాగా? మరి నా దగ్గరికి మీ ఉష వచ్చి "ఆంటీ... ఈ సెలవులకి మా పిన్నిగారి ఊరు వెళ్తున్నాను. సరదాగా నాతోపాటు పూర్ణిమనుకూడా తీసుకెళ్ళాలనుకుంటున్నాను. పంపిస్తారా?- అని అడిగిందే....?"

శకుంతలకు షాక్ తిన్నట్టయింది. కాసేపు ఏం మాట్లాడలేక పోయింది. ఆ తరువాత "మరి నిన్న ఉదయం మీకారు వచ్చి తీసుకెళ్ళింది కదండీ ఉషని? మీరంతా అందులో ఉన్నారనే అనుకున్నాను" అంది శకుంతల ఎలాగో తమాయించుకుని.

"తమాషాగావుందే.... మా కారులో పూర్ణిమను మీ ఇంటి దగ్గర దింపి, మా అబ్బాయి, వాళ్ళ ఫ్రెండూ తోటబంగళాకి వెళ్ళేటట్టూ, మీ ఇంటినుంచి స్టేషన్‌కెళ్ళి వీళ్ళిద్దరూ రైలెక్కేటట్టూ చెప్పారే నాతో. అయితే ఇద్దరూ కలిసి మనకి ధోకా ఇచ్చారన్న మాట. ఈ కాలం పిల్లలు ఏమిటోగానీ తల్లిదండ్రులను చంపుకు తింటున్నారు" అంది ఆవిడ.

శకుంతల- ప్రకాష్‌కి ఆక్సిడెంటయిన సంగతీ, తనిప్పుడు హాస్పిటల్‌నుంచి మాట్లాడుతున్న సంగతీ చెప్పి "ఎలాగైనా ఉషను వెంటనే పిలిపించగలరా? ప్లీజ్...." అని అడిగింది శకుంతల.

"అయ్యోపాపం మీ అబ్బాయికి ఆక్సిడెంటయిందా? అయితే నేనిప్పుడే మా తోటబంగళాకి ఫోన్‌చేసి అందరినీ వెంటనే రమ్మని చెబుతాలెండి. మీరు నాకు హాస్పిటల్ నంబరివ్వండి. నేను మళ్ళీ కాసేపటికి మీకు ఫోన్‌చేసి ఏ సంగతీ చెబుతాను." అంది సానుభూతిగా ఆవిడ.

తెల్లగా పాలిపోయినట్టున్న మొహంతో నడవలేక నడుస్తున్నట్టు వచ్చిన శకుంతలను చూసి ఆనందరావు ఆశ్చర్యపోయాడు. "ఏమైంది సక్కూ.... అలా వున్నావేం?" అని అడిగాడు.

అతను తనను చెడామడా తిట్టేస్తాడేమోనన్న భయంతో ఆ సమయంలో అబద్ధం చెప్పలేక పూర్ణిమా వాళ్ళమ్మ చెప్పిన సంగతంతా భర్తతో చెప్పేసింది శకుంతల.

అతని మొహం గంభీరంగా మారిపోయింది. కాసేపు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా ఉండిపోయి ఆ తరువాత భార్యను అనునయిస్తూ "బాధపడకు సక్కూ.... కష్టాలు వస్తే అన్నీ ఒకదాని వెంట ఒకటి వస్తాయి. మనం అధైర్యపడకూడదు అంతే." అన్నాడు.

అంతలో ఫోన్ వచ్చిందంటూ హాస్పిటల్ బాయ్ వచ్చి చెప్పడంతో శకుంతల గబుక్కున లేచి ఆతృతగా వెళ్ళింది. పూర్ణిమ తల్లి మాట్లాడుతూ "మనం అనుకున్నట్టే నలుగురూ కలిసి ప్లానేసుకుని మనల్ని ఫూల్స్‌ని చేసి వెళ్ళారు చూశారా? ఆక్సిడెంట్ సంగతి చెప్పగానే ఇప్పుడు బయల్దేరి వస్తున్నారు. మా వారికికూడా ఫోన్‌చేశాను. కాసేపట్లో మేమూ బయల్దేరి వస్తున్నాం" అని చెప్పింది.

"చాలా థ్యాంక్సండీ...." అని ఫోన్ పెట్టేసింది శకుంతల.

"హమ్మయ్య ఉష క్షేమంగా తిరిగి వస్తోంది అంతే చాలు" అనుకుంటూవుంటే పెద్ద బరువేదో దిగిపోయినట్లనిపించిందిఆమెకు.

o o o

పదిహేనురోజుల తరవాత ప్రకాష్ ఇంటికి తిరిగివచ్చాడు. ఉష ఇప్పుడు ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఒకవిధంగా వాళ్ళిద్దరికి బుద్ధి వచ్చినట్టే అయింది. పెద్దవాళ్ళు చెప్పినమాట వినకపోతే ఎంతటి అనర్థాలెదరవుతాయో అనుభవపూర్వకంగా తెలుసుకున్నట్టయింది వాళ్ళకు.

శకుంతల కూడా ఇప్పుడు తన అభిప్రాయాలను మార్చుకోక తప్పలేదు. పిల్లలను మరీ కట్టడిలో పెట్టకూడదు. పెడితే వాళ్ళు పెడదారి తొక్కుతారు. దానికి తన అక్కయ్య పిల్లలే ఉదాహరణ. అదేవిధంగా పిల్లలకు స్వేచ్ఛనూ ఇవ్వకూడదు. ఇస్తే ఆ స్వేచ్ఛను వాళ్ళు ఎలా దురుపయోగం చేసుకుంటారో ఇప్పుడు కళ్ళారా చూసింది తను. అందుకే ఇప్పుడు ఆనందరావు మాటలు వేదవాక్యాలుగా తోస్తున్నాయి ఆమెకు. పిల్లల తరుపున వాదించడం గానీ, వాళ్ళను సమర్థించడంగానీ పూర్తిగా మానేసి భర్త చెప్పినట్టే నడుచుకుంటూ నిశ్చింతగా ఉండగలుగుతోంది. ★